# సంగీత పరీక్ష

* శ్రీ కవికొండల వేంకటరావుగారు *

శ్రీనివాసరావు ఇంజనీరు (బి. ఇ.) పరీక్షలో కృతార్థుడైతేనే గాని పెళ్లి చేసికోనని బింకం పట్టుక్కూర్చొన్నాడు చాలాకాలం. కాని ఈ బింకం పట్టిబింకమేనని చాలామందికి తెలుసు. ఆ కారణంవల్ల పెళ్లికి ఆడపిల్లలున్న వాళ్లందరూ ఎప్పుడో వొకప్పుడు శ్రీనివాసరావుని ఆహ్వానం చేసి తమ అభిప్రాయం వెల్లడి చేస్తూవచ్చారు. విఫలులూ అయ్యారు. క్రమంగా శ్రీనివాసరావు ఊహాలు వర్ణనాతీతాలు అయిపోయి, కోరికలు గొంతెమ్మ కోరికలు అయినయ్. మరెవ్వరూ అతణ్ణి పిల్చి పిల్లనిస్తాం అనే వాళ్లు లేకపోయారు. శ్రీనివాసరావు చదువు పూర్తి అయినప్పట్నుంచి అస్తమానం సంగీత పరిశ్రమ చేసేవాడు. ఎక్కడన్నా జలపాతం చూచాడో అందలి విద్యుత్ప్రభావం ఎంత తెలిసికోగలిగేవాడో అందలి లయ జ్ఞానం అంత అలవఱచుకునే వాడు. గొప్ప మేధావి గొప్ప పరిశోధకుడూకూడాను శ్రీనివాసరావు.

చెప్పన్న దేశాల కన్నెపిల్లల్లోనూ వొప్పైనది, వన్నెచిన్నెలుగలది, వొయ్యార మొలకించేదీని "కీర". "కీర" కీర్తి ఎలాగో శ్రీనివాసరావు చెవిని బడింది. పిల్లకు సంగీతము వచ్చా అనే అతగాడి యక్షప్రశ్న! తతిమ్మా పరీక్షలనవసరం అని కూడా అతగాడి మతం. పిల్లకు పెళ్లికొడుకెలావుంటాడో చూదామనే భ్రమ, గొంతు కెల్లావున్నా సరే!

ఒక చోట పెళ్లికాని ఆడపిల్ల, మరోచోట పెళ్లికాని మగపిల్లవాడూ అంటూవుంటే, ఎల్లాగైనా వాళ్లిద్దరూ అన్యోన్యం చూచుకోక మానరు. ఎంత జరగదన్నా! ఎంత బ్రహ్మ విరుద్ధభావంతో ఉన్నా!



"కీర" అపురూపంగా పాడేస్తూవుంది. పాటతో సరిసమానంగా వాయులీను మీద కమాను యీడుస్తూ వుంది. ఎలావుంది పిల్ల? ఎత్తికుదేస్తే ఎగిరి తూలేలాగుంది! శ్రీనివాసరావు ఎక్కడన్నా లయ తప్పుతుందా పట్టుకుందాం అనే విమర్శనా దృష్టి

విడిచి పెట్టకుండా, పెళ్ళికొడుకు చూపులు చూస్తూవున్నాడు. తన చేతులతో తాళం వేస్తూ తల వూపుతూ "బలే! బాగు! బళా!" అని హెచ్చరిస్తూవున్నాడు. "కీర" అపురూపంగా కేలూ కమానూ ఎంత దూరంలాగేసిందంటే వోతూరి, నే చెప్పలేను! కొండనుండి చెట్టుశాఖ సాగి సాలిపురుగును గెంతించినట్లు మెఱయించిందను కోండి కమాన్నూ కీల్నూ, కీల్నూ కమాన్నూ వక్షోజయుగళి నిలుకడనే!

అంత బాగా పెళ్ళికూతురు వాయిస్తూ పాడుతూవుంటే శ్రీనివాసరావు "ఛెస్సి తగలేశావ్! బంగారంలాంటి కృతి! తాళం తప్పింది! తప్పిందే! ఛెస్సి' తాళం తప్పిందే!" అని కేకేశాడు. "కీర" వెంటనే ఫిడేలు అక్కడ పడేసి "ఏమయ్యో! పెళ్ళి కాకుండానే హాములు చేస్తున్నావు!" అంది పయ్యంట కంట నొత్తుకు వెడవెడులేస్తూ. పెళ్ళికూతురు తల్లి "చూపులు చూపులే, సంగీతం సంగీతమే! చూపుల కొచ్చి పరీచ్చలేమిటి? ఆమాత్రం స్వతంత్రం లేకపోతే అమ్మకడుపున బుట్టి బ్రదికేదెట్లా? అస్తమానం పెళ్ళికాని ముందప్పట్నుంచీకూడా మగాడితో లయకలిపి పాడాలీ అంటే చావుకాదూ ఆడదానికి!" అని రంయిమంది. ."పెళ్ళయాక మట్టుకు?" అని గంయిమంది కీర పెద్దప్పగోరు. కీర తండ్రి "పెళ్ళయ్యాక పప్పపా చొవ్వొచ్చో వేయిలాంటి వాళ్ళకు" అన్నాడు శ్రీనివాసరావును చూపుతూ.

శ్రీనివాసరావు సవిమర్శగా అనబోయాడు "అదేమిటండీ అలా అంటారు? నేను సరియైన లయ చూపెడతాను. ఇదిగో" అని వేయబోయాడు మళ్లీ కృతికి సరియైనతాళం తాను..... ఆపాళంగా పెళ్ళికూతురు తండ్రి శ్రీనివాసరావు చెయి పట్టుకు లయ కట్టిపెట్టించి, "చూడు అబ్బాయీ! మా పిల్లకు నేను చెప్పించింది పెళ్ళి సంగీతం. పెళ్ళి సగీతం అన్నది చూడాలిసిందేగాని వినవలసింది కాదు. ఫ ఫ ఫ ఫ ఫ" అన్నాడు. శ్రీనివాసరావు "వెఱ్ఱి మామా! నా మతంలో సంగీతం అన్నదెలాంటిదీ అంటే—పశుర్వేత్తి, శిశుర్వేత్తి—". కీర తండ్రి "తెఱ్ఱిల్లుడా! నా మతంలో సంగీతం అంటే ఎలాంటిదీ అంటే, మగాళ్లదైతే పశువుల కోసం, ఆడాళ్లదైతే శిశువుల కోసం, రెండూ కానివాళ్లదైతే నాగుబాముల కోసం అని—"

శ్రీనివాసరావు "అతి (too much) కి పోయి సిద్ధాన్నాన్ని చెడగొట్టుకున్నానే" అని చింతించేడు.

మర్నాడు గాన సభ! "కీర" "చింతింపనేమి ఫలము" అన్న కృతి విసిరింది. శ్రీనివాసరావు సభలో మునుముందు కూర్చుని లయ వేస్తూ "అపర శారదా!" అని అభినందించాడు! కీర పాట ఆపుతూ "లయ విశారదులకు జోహారు" అంది.